పెద్దిరెడ్డికి మరో షాక్


జడ్పీ కార్యాలయం ఎదుట పులిచర్ల జడ్పీటీసీ మురళీధర్, అతని అనుచరులు

- పార్టీకి, పదవికి పులిచర్ల జడ్పీటీసీ రాజీనామా
- మరికొందరు ఎంపీటీసీలు, సర్పంచులు కూడా
- కష్టాల్లో ఉన్న శ్రేణులకు భరోసా ఇవ్వకపోవడంతో నిర్ణయం

కల్లూరు/చిత్తూరు రూరల్, జూలై 12: పుంగనూరు నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా వైసీపీని వీడుతున్నారు. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనచరుడు, పులిచెర్ల జడ్పీటీసీ మురళీధర్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి షాక్ ఇచ్చారు. ఆయనతో పాటు కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు కూడా పార్టీ వీడారు. తనకు మద్దతునిచ్చే సర్పంచులు, ఎంపీటీసీలు, అనుచరులో కలిసి తొలుత మురళీధర్ చిత్తూరులోని జడ్పీ కార్యాలయానికి వచ్చారు. సీఈవో అందుబాటులో లేకపోవడంతో ఆమెను ఫోన్ ద్వారా సంప్రదించారు. రాజీనామా తనకు కాదని కలెక్టర్‌కు ఇవ్వాలని ఆమె సూచించారు. దీంతో ఆయన కలెక్టరేట్‌కు వెళ్లి జేసీ శ్రీనివాసులుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని తన అనుచరులతో కాసేపు చర్చించారు. ఈ సందర్భంగా చిత్తూరులోను.. సాయంత్రం పులిచెర్ల మండలం పాళ్యంలోని తన ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతానికి వేరే పార్టీలో చేరే ఉద్దేశం లేదని, తమ అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కష్ట కాలంలో ఉన్న కేడర్‌ను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదుకోకపోవడంతోనే రాజీనామాలు చేశామన్నారు. కష్టాలు పడతున్న తమను, తమ కార్యకర్తలను ఆదుకోవడంలో పార్టీ పెద్దలు విఫలమయ్యారన్నారు. పులిచెర్ల వైసీపీలో రాజీనామాల పర్వం ప్రారంభమైందని, రాబోవు రోజుల్లో మరిన్ని జరుగుతాయన్నారు. వైసీపీలో కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాథుడేలేదన్నారు. తమపై దాడులు జరుగుతున్నా ధైర్యంగా చెప్పే నాయకుడు కూడా కరువయ్యారని పేర్కొన్నారు. కాగా, నియోజకవర్గ స్థాయిలో బలమైన కేడర్ కలిగిన మురళీధర్ వైసీపీని వీడటంతో మండలంలో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. గతంలో ఈయన వైస్ ఎంపీపీగా, వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్‌గానూ పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి గల్లా అరుణకుమారికి సన్నిహితుడిగా కొనసాగారు.

ఒక్కొక్కరుగా పార్టీ వీడుతూ..

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. గతంలో పుంగనూరు మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీంబాషాతో బాటు 10 మంది కౌన్సిలర్లు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబును కలిసి వైసీపీకి రాజీనామాలు చేసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. రొంపిచెర్లలోని 5 పంచాయతీల్లో ఉపసర్పంచ్‌తో బాటు 9మంది వార్డు సభ్యులు వైసీపీని వీడారు. తాజాగా పులిచెర్ల మండలంలో రాజీనామాలు మొదలయ్యాయి. పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు.. మండల వైసీపీలో కీలకమైన పాళ్యంకు చెందిన తరిగొండ మురళీధర్ కూడా తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులకు ఇబ్బందులు, కేసులు పెట్టి వేధించారు. ఇప్పుడు తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. నియోజకవర్గంలోనూ పెద్దిరెడ్డికి మెజారిటీ గణనీయంగా తగ్గింది. గత ప్రభుత్వంలో రాజకీయాలు, అధికారాన్ని శాసించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి పుంగనూరుకు రాకుండా అడ్డుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో కొందరిపై కార్యకర్తలు హెచ్చరించడంతో వైసీపీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి. తమను ఆదుకునే దిక్కు ఎవరని, పార్టీ పెద్ద నాయకులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారు. ఇదే రాజీనామాలకు కారణమయ్యాయి. నియోజకవర్గంలో వైసీపీకి రాజీనామాలు చేస్తున్న వాళ్లంతా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నారు.

రాజీనామా చేసింది వీరే

పులిచెర్ల జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ తన పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీలు రాశిప్రసాద్, ఈశ్వరి గోవర్ధన్, కల్లూరు-1, కల్లూరు-2 ఎంపీటీసీ సభ్యులు రెడ్డి బాబుల్లా, మంజుల మునస్వామి, సర్పంచులు షుకూర్ (కల్లూరు), ఉషారాణి (దేవళంపేట), రాణెమ్మ (పులిచెర్ల), మధు (మంగళంపేట), అనిత (106 రామిరెడ్డిగారిపల్లి), వెంకటేష్ (రేణుమాకులపల్లి), సరస్వతి (పాళెం) వైసీపీ సభ్యత్వానికి రాజీనామాలు చేశారు. మరికొంతమంది ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పార్టీని వదలి టీడీపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.


కుప్పం మున్సిపల్ చైర్మన్ చేరిక పెండింగ్

కుప్పం, జూలై 12: కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలుగుదేశం పార్టీలో చేరడమనే ప్రక్రియ ప్రస్తుతానికి వాయిదా పడింది. 9 మంది వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆయన రెండు రోజుల క్రితం అమరావతికి పయనమై వెళ్లిన విషయం తెలిసిందే. ఓ మంత్రి ద్వారా టీడీపీలో చేరడానికి డాక్టర్ సుధీర్ తీవ్రంగా ప్రయత్నించారు. అమరావతిలోని టీడీపీ కార్యాలయం దాకా వెళ్లిన ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ అపాయింట్‌మెంట్ లభించక వెనుదిరిగారు. అమరావతినుంచి బయలుదేరి శుక్రవారం కుప్పం చేరుకున్నారు. స్థానిక టీడీపీ నాయకులు కొంతమంది మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ చేరికపట్ల విముఖంగా ఉండడం, కొద్దిమంది కార్యకర్తల నిరసనల నేపథ్యంలో ప్రస్తుతానికి ఆయన, పార్టీలో చేరడం వాయిదా పడింది. నేడు కాకపోయినా రేపైనా సుధీర్, టీడీపీలో చేరడానికి గల అవకాశాలైతే పూర్తిగా మూసుకుపోలేదని తెలుస్తోంది.

వైసీపీ ప్రభుత్వం ఇల్లు కట్టుకోవాలనే పేదల కలల్ని సాకారం చేయలేకపోయింది. నిర్మాణానికి పనికిరాని చోట పట్టాలిచ్చింది. ఇంటి నిర్మాణానికి కేంద్రమిచ్చే వాటాకు రాష్ట్ర వాటా కలుపుకోలేదు. తక్కువ యూనిట్ కాస్ట్‌తో ఇంటి నిర్మాణం చేసుకోలేక చాలామంది పేదలు ఊరుకుండిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం యూనిట్ కాస్ట్ పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పేదల ఇళ్ల నిర్మాణానికి ఊరట



- యూనిట్ కాస్ట్ పెంచే ఆలోచనలో కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే ఉచితంగా అందుతున్న ఇసుక
- ఎన్టీఆర్ హౌసింగ్‌గా పథకం పేరు మార్పు

టీడీపీ 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఒక్కో ఇంటికి కేంద్రం రూ.1.50 లక్షలు ఇచ్చేది. దానికి రాష్ట్ర ప్రభుత్వం (టీడీపీ) రూ.లక్ష అదనంగా వేసుకుని లబ్ధిదారుడికి రూ.2.50 లక్షలు అందించేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక కేంద్రమిచ్చే వాటాతోనే సరి పెట్టేసింది. రాష్ట్ర వాటా నయా పైసా ఇవ్వలేదు. ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు ఇవ్వగా.. మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.30 వేల ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చేవి. అంటే ఆ మొత్తం కూడా కేంద్రానివే. ఇలా రాష్ట్ర వాటా లేకపోవడంతో లబ్ధిదారులు బాగా నష్టపోయారు. వాస్తవానికి కరోనా తర్వాత నిర్మాణ రంగ సామగ్రి ధరలు రెట్టింపు అయినా యూనిట్ కాస్ట్ పెంచకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల కోణంలో ఆలోచిస్తోంది. కేంద్రం ఇచ్చే మొత్తానికి అదనంగా వేసి లబ్ధిదారులకు అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

యూనిట్ కాస్ట్ పెంచాలని..

ఇటీవల రాష్ట్ర హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషాతో జిల్లాల హౌసింగ్ పీడీలు సమావేశమయ్యారు. 'యూనిట్ కాస్ట్ తక్కువ కావడంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రావడం లేదు. పెంచితే నిర్మాణాలు ఊపందుకుంటాయి. యూనిట్ కాస్ట్ పెరిగేలా చర్యలు తీసుకోండి' అని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు.

ఇంటి నిర్మాణానికి సరిపోయేలా ప్రభుత్వ సాయం

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వాటాను ఇవ్వాలనే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. 2014-19 మధ్యకాలంలో ఇచ్చినట్లు రూ.లక్ష వాటా ఇచ్చినా.. ఇప్పుడు ఇసుక ఉచితంగా అందుబాటులో ఉండడంతో లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. కేంద్ర వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర వాటా రూ.లక్ష కలిపి లబ్ధిదారుడికి మొత్తంగా రూ.2.50 లక్షలు అందుతుంది. మరో రూ.లక్ష చేతి నుంచి వేసుకుంటే లబ్ధిదారుడి సొంతింట కల నెరవేరుతుంది.

జిల్లాలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి

జిల్లాలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 73,584 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 46,374 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. 3082 మంది లబ్ధిదారులు ఇంకా ఇంటి నిర్మాణాలను ప్రారంభించలేదు. మరో 3560 మంది పునాది గుంతలు తవ్వి వదిలేశారు. 10948 మంది పునాదులు మాత్రమే నిర్మించుకుని తదుపరి నిర్మాణాల జోలికి పోలేదు. 5334 మంది గోడల్ని, 4286 మంది స్లాబు వేసుకున్నారు.

పథకాల పేర్ల మార్పు ఇలా..

గృహ నిర్మాణ పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. 2014-19 మధ్యకాలంలో ఉన్న పేరును మళ్లీ పెడుతూ తాజాగా ఆ శాఖ ఎండీ గిరీషా ఉత్తర్వులు ఇచ్చారు. 2014-19 కాలంలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్, ఎన్టీఆర్ స్పెషల్ హౌసింగ్ పథకాలను వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ రూరల్ హౌసింగ్, వైఎస్సార్ స్పెషల్ హౌసింగ్ అని పేర్లను మార్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ పాత పేర్లను పెట్టింది. పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ పథకాల పేర్లలో ఎలాంటి మార్పు లేదు. దశాబ్దాల కిందట ప్రభుత్వ సాయంతో ఇళ్లను నిర్మించుకున్న వారి నుంచి ముక్కు పిండి మరీ రూ.10 వేలు, రూ.20 వేలను వైసీపీ ప్రభుత్వం వసూలు చేసింది. ఇలా జిల్లాలోనూ రూ.23 కోట్లకుపైగా అధికారులు బలవంతంగా వసూలు చేశారు. దానికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం అని పేరు పెట్టారు. ఇప్పుడు దాన్ని ఓటీఎస్ అని మాత్రమే పెట్టారు. కూటమి ప్రభుత్వం ఓటీఎస్ వసూళ్ల జోలికి వెళ్లే అవకాశం లేదు.

పాత ఇళ్లకు లేని స్పష్టత

అర్హులకు కూటమి ప్రభుత్వం కొత్త ఇళ్లను మంజూరు చేయనుంది. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు యూనిట్ కాస్ట్‌ను పెంచే అవకాశముంది. ఇప్పటికే మంజూరై ఆయా నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్ల గురించి ఇంకా స్పష్టత రాలేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిర్మాణం ప్రారంభమైన ఇళ్లకు మాత్రం కొత్తగా పెంచిన యూనిట్ కాస్ట్ అమలయ్యే అవకాశం లేదు. పెండింగ్ బిల్లుల గురించి కూడా క్లారిటీ లేదు.

యూనిట్ కాస్ట్ పెరుగుతుంది

పీఎంఏవై 2 పథకం కింద ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ప్రభుత్వ సాయాన్ని (యూనిట్ కాస్ట్) కూటమి ప్రభుత్వం పెంచనుంది. దీనికి మరో ఆరు నెలల వరకు పడుతుంది. ఇప్పటికే మంజూరైన ఇళ్లకు మాత్రం యూనిట్ కాస్ట్ పెరగదు.

- గిరీషా, రాష్ట్ర హౌసింగ్ ఎండీ

కడా పీడీగా వికాస్ మర్మత్

బాధ్యతల స్వీకరణ


కడా పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న వికాస్ మర్మత్

కుప్పం, జూలై 12: కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రాజెక్ట్ డైరెక్టరుగా వికాస్ మర్మత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనరుగా ఉన్న మర్మత్ కడా పీడీగా బదిలీపై వచ్చారు. కడా కార్యాలయంగా మారిన స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. కుప్పం చేరుకున్న ఆయనకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్డీవో జి.శ్రీనివాసులు, తహశీల్దారు హరికుమార్ తదితరులు సాదర స్వాగతం పలికారు. స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో పీడీ వికాస్ మర్మత్ పూజలు చేశారు. కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే పనిలో పడ్డారు. స్మార్ట్ కుప్పం ప్రాజెక్ట్‌లో భాగంగా ఇటీవల అమరావతినుంచి ప్రత్యేక అధికారుల బృందం పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని వెళ్లిన విషయం తెలిసిందే. పీడీ మర్మత్ కూడా కుప్పం ఆర్టీసీ బస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్‌తోపాటు మున్సిపల్ పార్క్ తదితర ప్రాంతాలను పరిశీలించి, స్థానిక అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుప్పం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల తయారీపై చర్చించారు.

సీఎం ఆశయ సాధనే లక్ష్యం

కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి ప్రధానోద్దేశమని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. కడా పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మోడల్ మున్సిపాలిటీ, మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేయడానికి అవసరమైన ప్రణాళికల రూప కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ను మోడల్ బస్టాండుగా రూపొందిస్తామని చెప్పారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఇప్పటికే పేరున్న కుప్పాన్ని ఆ రంగంలో మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూనే, పేదరిక నిర్మూలనకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని పీడీ స్పష్టం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కుప్పం ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్న విషయం కడా ఏర్పాటుతోనే అర్థమైందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. అధికార యంత్రాంగంతోపాటు టీడీపీ నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో బాధ్యతలు తీసుకుని...

చిత్తూరు కలెక్టరేట్: కడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులైన వికాస్ మర్మత్ తొలుత చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్ సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులుని కలిసి పుష్పగుచ్ఛం అందించి కడా ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్వో పుల్లయ్యను కలిశారు.

→ కలెక్టరు సుమిత్ కుమార్‌తో కడా పీడీ

కౌలు రైతులకు హక్కుపత్రం అందించాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 12: జిల్లాలోని ప్రతి కౌలు రైతుకూ హక్కు పత్రం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ ఆదేశించారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో 31 మండలాల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో ఆయన సమావేశమయ్యారు. ఖరీఫ్ సాగుకు కావాల్సిన ఎరువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 16,160 హెక్టార్లలో పంటలు సాగు చేశారన్నారు. 40,337 క్వింటాళ్ల వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేశామన్నారు. పీఎం కిసాన్‌కు అర్హులైన రైతుల ఈకేవైసీ చేయాలని, ఆధార్‌లో పొరబాట్లను సరిచేయించాలని సూచించారు. పొలంబడి నిర్వహించి, మట్టి నమూనాలు సేకరించి తిరుపతిలోని పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు.

పిచ్చికుక్క వీరంగం

- విద్యార్థులకు గాయాలు

ఐరాల, జూలై 12: ఐరాల మండలం నాగమవాండ్లపల్లెలో శుక్రవారం ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. ఉదయం గ్రామానికి చెందిన లక్ష్మమ్మను కరిచింది. గ్రామస్తులు తరమడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి పరుగులు తీసింది. కొంత సమయం తర్వాత ప్రాథమిక పాఠశాలలోకి దూరి విద్యార్థులపై దాడి చేసి, ఐదుగురిని గాయపరిచింది. గాయపడిన చిన్నారులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆవిష్కార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు (సెంట్రల్), జూలై 12: ఆవిష్కార్ అవార్డులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకాస్టు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ అంశంపై 6-12 తరగతుల విద్యార్థుల 3-7 నిమిషాల వీడియో చేసి గైడ్ టీచర్లు ఆన్‌లైన్‌లో పంపి లక్ష రూపాయల బహుమతులు పొందాలని కోరారు. ఇతర వివరాలకు 9966775534, 9966332456లలో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసం.. నిలదీసినందుకు దాడి

పుంగనూరు రూరల్, జూలై12: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేయడమే గాక నిలదీసిన బాధితుడిపై దాడిచేయడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు సూర్యానగర్‌కు చెందిన మహేంద్ర కొత్తయిండ్లుకు చెందిన రితీశ్(22)కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.50వేలు తీసుకున్నాడు. అయితే ఎన్నిరోజులైనా మహేంద్ర నుంచి ఏలాంటి సమాధానం రాకపోవడంతో రితీశ్‌తో పాటు అతడి అన్న శ్రావణ్‌కుమార్ వెళ్లి మహేంద్రను నిలదీశారు. దీంతో మహేష్ కుటుంబసభ్యులు వారిపై దాడి చేసి గాయపరిచారు. శ్రావణ్‌కుమార్ పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

వైసీపీ నేతల ఆక్రమిత భూమి

ఆలయానికి స్వాధీనం

- తప్పుడు నెంబరుతో చేసిన ప్లాన్ అప్రూవల్ రద్దుకు కమిషనర్ సిఫార్సు



పుంగనూరు, జూలై 12: పుంగనూరు పట్టణం పాత బస్టాండు సమీపంలోని వైసీపీ నేతల ఆక్రమణలో ఉన్న భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూమిని శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి ఆలయానికి చెందినదిగా అధికారులు గుర్తించడంతో చర్యలు చేపట్టారు. రాజకీయ పలుకుబడితో వైసీపీ నేతలు సర్వేనెంబరు మార్చి దేవుడి భూమిని కాజేయాలని ప్రయత్నించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలతో మున్సిపాలిటీ చేసిన నిర్మాణపు ప్లాన్ అప్రూవల్ రద్దుకు కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దేవుడి భూమి ఆక్రమణలకు గురికాకుండా ఆస్థలంలో ఆలయానికి ఆదాయం వచ్చేలా నిర్మాణాలు చేపట్టేందుకు వీరశైవలింగాయత్‌లు స్థలాన్ని శుభ్రం చేయించి మట్టితోలి చదును చేసి నిర్మాణాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా ఆలయాన్ని కాపాడి నిర్మాణాలు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాగా, భోగనంజుండేశ్వర స్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబరు 115/12లోని 202.66 చదరపుగజాల స్థలం తమదేనంటూ వైసీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ కొండేటి నాగభూషణం కుమారుడు కె.నరేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొండేటి నాగేంద్ర కుమారుడు కె.రెడ్డికుమార్ పుంగనూరుకు చెందిన కె.సద్దాంహుస్సేన్, కే.సాధిక్ హుస్సేన్‌కు రూ21.49 లక్షలకు 2022 ఫిబ్రవరి 22వతేదీ విక్రయించి రిజిస్టర్ చేశారు. కాగా భోగనంజుండేశ్వర స్వామి ఆలయ సర్వేనెంబరులోని 115/13లోని 22 సెంట్ల భూమి ఆలయానికి చెందినదని సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ఆలయ ఈవో కమలాకర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సర్వేయర్ కిరణ్మయి, సిబ్బంది ఎస్ఎల్ఆర్, ఇతర రికార్డులు పరిశీలించి స్థలాన్ని సర్వే చేశారు. 115/13లోని 22 సెంట్ల భూమి ఆలయానికి చెందినదని తేల్చేశారు. తమదేనంటూ విక్రయించిన భూమిగా వైసీపీ నేతలు పేర్కొన్న 115/12లో 22 సెంట్ల స్థలం క్షేత్రస్థాయిలో కనిపించకపోవడంతో బోగస్‌గా తేలింది. తప్పుడు నెంబరుతో పుంగనూరు సబ్‌రిజిస్ట్రార్ ఏ విధంగా భూమిని తనిఖీ చేసి కొలతలు పరిశీలించకుండా రిజిస్టర్ చేస్తారని వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. మున్సిపాలిటీలో చేసిన ప్లాన్ అప్రూవల్ రద్దు అవుతుందని, సర్వే, ఎస్ఎల్ఆర్ రికార్డులు, భూమిపై కొలతలు ఆలయానికి చెందినవిగా గుర్తించడంతో ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ నరసింహాప్రసాద్‌రెడ్డి వివరించారు. ఎట్టకేలకు ఆ భూమి ఆలయానికే దక్కడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


- చంద్రబాబు హయాంలోనే నిధులు.... పనులు
- గత ప్రభుత్వంలో పూర్తిగా స్తంభించిన పనులు
- రూ. 2500 కోట్లతో పూర్తి కావాల్సిన కాంట్రాక్టు రద్దు


బాలాజీ రిజర్వాయర్ వద్ద పనులాగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనం

- రూ. 5 వేల కోట్ల అంచనాతో ప్రత్యామ్నాయ ప్రణాళిక
- పరిశీలనలోనే ముగిసిపోయిన పుణ్యకాలం

గాలేరు-నగరిపై మళ్లీ ఆశలు

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పర్యటించిన సందర్భంగా ఆ ప్రాంత ప్రజలకు మాట ఇచ్చారు.అన్ని రంగాల్లో వెనుక బాటుతనానికి గురైన ఉత్తరాంధ్ర ప్రజలకు న్యాయం చేయాల్సిందే. అయితే సొంత జిల్లాలో ఐదేళ్లుగా అతీగతీ లేకుండా పోయిన గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు విషయంలోనూ జిల్లా ప్రజలు ఆయన నుంచీ ఇదే ప్రాధాన్యతను కోరుకుంటున్నారు. 1985 నుంచీ జిల్లా వాసులను ఊరిస్తున్న గాలేరు-నగరి ప్రాజెక్టును దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఏ ముహూర్తాన ప్రకటించారో గానీ అప్పటి నుంచీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే వుంది. రామారావు తర్వాత ఎందరో ముఖ్యమంత్రులు మారినా పనులు మొదలైంది మాత్రం చంద్రబాబు హయాంలోనే. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో పనులు స్తంభించడమే కాక మునుపటి కాంట్రాక్టును రద్దు పరిచి డిజైన్ సైతం మార్చేశారు. ఇపుడు మళ్ళీ చంద్రబాబు సీఎం కావడంతో సొంత జిల్లా ప్రజల్లో ఆశలు మొలకెత్తుతున్నాయి.


చంద్రబాబు హయాంలో జరిగిన బాలాజీ రిజర్వాయర్ కట్ట పనులు

ప్రాజెక్టు నేపథ్యం

దివంగత సీఎం ఎన్టీ రామారావు రాయలసీమలో కరువు శాశ్వత నివారణ కోసం గాలేరు - నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు రెండవ దశలో 8 నుంచీ 14 వరకూ మొత్తం ఏడు ప్యాకేజీల కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీరందించాల్సి వుంది. తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాల్లో 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి వుంది. దీనికోసం ఉమ్మడి కడప జిల్లా నుంచీ శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్ళు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా నీరు రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు చేర్చాలి. అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు, ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచి మిగిలిన రిజర్వాయర్లను కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్ళతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ. 2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. 2008లో మళ్ళీ అంచనాలను రూ. 2526 కోట్లకు సవరించింది. పనులకు అనుమతి ఇచ్చిన నాటి వైఎస్ ప్రభుత్వం పనులు మాత్రం మొదలు పెట్టలేదు. దీంతో 2014 వరకూ ఆరేళ్ళ పాటు ప్రాజెక్టు మరుగునపడింది.

చంద్రబాబుపైనే ఆశలు

ఇటీవలి ఎన్నికల్లో చంద్రబాబు తిరిగి సీఎం కావడంతో గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే ఈ పనులను పూర్తి చేస్తానని, జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఆయనే ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించిన నేపథ్యంలో ఇపుడు తొలి ప్రాధాన్యత కింద ఈ ప్రాజెక్టును ఎంపిక చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు పనులను సమీక్షించి, అవసరమైన అంచనాలు రూపొందించాలని, ఆ మేరకు నిధులు మంజూరు చేసి వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రాజెక్టుకు ప్రాణం పోసిన చంద్రబాబు

2014లో చంద్రబాబు సీఎం కాగానే సొంత జిల్లాలో మరుగున పడిన గాలేరు-నగరి ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోశారు. రూ. 2526 కోట్లతో పనులకు టెండర్లు పిలిచారు. ఆయన చొరవతో జిల్లా యంత్రాంగం పరుగులు పెట్టింది. భూసేకరణ పనులు జోరందుకున్నాయి. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట నిర్మాణం, అక్కడ నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్ వరకూ కాలువ తవ్వకం పనులు, మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.18 టీఎంసీలుగా వుండగా దాన్ని 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ. 56.08 కోట్లతో పనులు మొదలు కాగా రూ. 25 కోట్ల పనులు చేశారు. వేణుగోపాల సాగర్ అంచనా వ్యయం రూ. 160 కోట్లు. ఇందులో రూ. 35 కోట్ల పనులు పూర్తయ్యాయి. కాలువతో సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు. ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాక టన్నెళ్ళ నిర్మాణం పెండింగ్ పడింది. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రాలేదు. 2019లో ఎన్నికలు వచ్చేటప్పటికీ గాలేరు-నగరి ప్రాజెక్టు పనుల పురోగతి చాలా ఆశాజనకంగా వుండింది.



జగన్ రాకతో టెండర్లు రద్దు... డిజైన్ మార్పు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి జగన్ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. పనులన్నీ ఆగిపోయాయి. నిధులూ విడుదల కాలేదు. 2020 జూలై 8న ప్రభుత్వం టెండర్లు రద్దు చేసింది. పాత డిజైన్ ప్రకారం పనులు చేపడితే రామచంద్రాపురం మండలంలో ప్రతిపాదిత పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్ల పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుందని, భూముల విలువ విపరీతంగా పెరిగిపోయినందున భూసేకరణ ప్రభుత్వానికి భారమవుతుందన్న వాదన తెరపైకి తెచ్చింది వైసీపీ ప్రభుత్వం. ఆ వంకతో ఆ రెండు రిజర్వాయర్లనూ రద్దు చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని గాలేరు-నగరి కాలువకు మళ్ళించేలా ప్రత్యామ్నాయ డిజైన్‌ను రూ. 5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో రూపొందించారు. అయితే అప్పటి నుంచీ ఆ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. దీంతో ఐదేళ్ళ పాటు ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. మరో వైపు పాత టెండర్లు రద్దయ్యాయి. రీ టెండర్లు పిలవలేదు. డిజైన్ కూడా మార్చివేసినా దానికీ అనుమతులు లేవు. నిధులూ ఇవ్వలేదు. అటవీ శాఖ అనుమతులు కూడా సాధించలేదు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వం గాలేరు-నగరి ప్రాజెక్టు ఊపిరి తీసేసినట్టయింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతిచెందిన రమాదేవి

భాకరాపేట, జూలై 12: భాకరాపేట ఘాట్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవిఅనే మహిళ మృతి చెందింది. భాకరాపేట ఎస్‌ఐ విజయ కుమార్ నాయక్ కథనం మేరకు... రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ దిగువజూపల్లెకు చెందిన రమాదేవి(36) తన తమ్ముడు శ్రావణ్, కుమార్తె లక్ష్మిశిరతో కలిసి ద్విచక్ర వాహనంలో శుక్రవారం తిరుపతి నుంచి స్వగ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో ద్విచక్ర వాహనం చెడిపోవడంతో ఆమె తన తమ్ముడు, కుమార్తెను దానిని తీసుకురమ్మని చెప్పి ఆటోలో బయలుదేరింది. ద్విచక్ర వాహనం తోసుకువస్తున్న వారికి మంచి నీళ్ల బాటిల్ అందించేందుకు ఆటో నుంచి దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న కాంక్రీట్ మిక్సర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వారు హుటాహుటిన భాకరాపేట పీహెచ్‌సీకి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన తల్లిని భాకరాపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు, సిబ్బందిని ఆక్సిజన్ పెట్టమని అభ్యర్థించినా వారు పట్టించుకోలేదని, ఆ తరువాత ఆక్సిజన్ అమర్చినా అది పనిచేయలేదని కుమార్తె లక్ష్మిశిర కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై వైద్యాధికారి అలెగ్జాండర్ మాట్లాడుతూ పీహెచ్‌సీకి తీసుకువచ్చేటప్పటికే రమాదేవి మృతి చెందిందని, ఆ విషయం తాము ఆమె కుటుంబసభ్యులకు తెలియజేశామన్నారు. అయినా వారు వినకుండా ఆక్సిజన్ పెట్టమని కోరారని, ఆక్సిజన్ పెట్టినా ఫలితం లేకపోయిందన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


మృతిచెందిన మధుకుమార్

బంగారుపాళ్యం, జూలై 12: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో ఈనెల 10వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన మధుకుమార్, భరత్‌కుమార్, నాగరాజు ద్విచక్ర వాహనంలో సూళ్లూరుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మొగిలి ఘాట్‌లో అడ్డంగా వచ్చిన అడవి పందులను తప్పించే క్రమంలో వాహనం బోల్తాపడింది. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మధుకుమార్(35) మృతిచెందాడు. ఏఎ్‌సఐ మల్లప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం సీజ్.. ఒకరి అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న మద్యం విక్రేత

శాంతిపురం, జులై 12 : అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు.. ఎస్‌ఐ తన సిబ్బందితో శుక్రవారం గెసికపల్లె వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. శాంతిపురం మండలం చిన్నకర్లగట్ట గ్రామానికి చెందిన గోవిందరాజులు కర్ణాటక రాష్ట్రం కెంపాపురం నుంచి 15 లీటర్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

రూ. 3.90లక్షల కర్ణాటక మద్యం సీజ్



పుంగనూరు, జూలై12: అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.3,90,256లు విలువైన కర్ణాటక మద్యా న్ని పోలీసులు సీజ్ చేశా రు. పుంగనూరు సీఐ జయరామయ్య కథనం మేరకు.. శుక్రవారం పుంగనూరు సమీపంలోని డాన్ బోస్కో స్కూల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కెఏ01 ఏడి1684 నెంబరు గల కారులో పెద్దపంజాణి మండలం గల్లావారిపల్లెకు చెందిన జగదీశ్(29)మద్యం తరలిస్తుండగా గుర్తించారు. కారుతో పాటు మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.




రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు - మృతి చెందిన పెళ్ళి కుమారుడు బాలు

పెళ్ళి చూపులకు వెళ్ళి వస్తుండగా...

కారు అదుపు తప్పి బోల్తా - యువకుడి మృతి, ముగ్గురికి స్వల్ప గాయాలు

చంద్రగిరి, జూలై 12: పెళ్ళి చూపులకు వెళ్ళి వస్తుండగా ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో పెళ్ళి కుమారుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు బాలు(26) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే బాలు పెళ్ళి చూపులు కోసమని బాలుతోపాటు సోదరుడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌లు బెంగుళూరులో బుధవారం రాత్రి 9 గంటలకు కారులో బయలుదేరి గురువారం ఉదయం 11.30 గంటలకు తూర్పు గోదావరి జిల్లా, భీమవరం వెళ్ళారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బెంగుళూరుకు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలోని చంద్రగిరి మండలం, ఎం.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే ఆవు అడ్డం రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెళ్ళి కుమారుడు బాలు తలకు తీవ్ర గాయాలు కాగా, శంకరమ్మ చేయి విరిగింది. దిలీప్, వాసులకు రక్త గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, బాలు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్


ఫ్యాక్టరీలో తయారయ్యే పల్ప్‌ల గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న మేనేజర్ షమీర్‌శర్మ

గంగాధరనెల్లూరు, జూలై 12: మండలంలోని 100గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫామ్‌ఫ్రెష్ ఫ్యాక్టరీని కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. మేనేజర్ షమీర్‌శర్మ ఆయనకు స్వాగతం పలికారు. ప్లాంటుల్లో యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీకి సంబంధించిన అన్ని వివరాలను కలెక్టర్‌కు మేనేజర్ తెలిపారు. ల్యాబ్‌లో బాటిల్స్‌లో నింపి ఉంచిన మామిడి, జామ, చింతపండు, టమాటా, ఉసిరి కాయ పల్ప్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీ ఎక్స్‌టెన్షన్ ఇన్‌చార్జి చంద్రకుమార్ పాల్గొన్నారు.

బావిలో పడిన చిన్నారి మృతి


నాని(ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, జూలై 12: మండల పరిధిలోని సరిగప్పకొట్టాలులో బావిలో పడి తీవ్ర గాయాలైన చిన్నారి శుక్రవారం మృతి చెందాడు. సరిగప్పకొటాలు గ్రామానికి కుమార్, సుమ దంపతుల కుమారుడు నాని(3) ఇంటి దగ్గర గురువారం మధ్యాహ్న ఆడుకొంటూ సమీపంలోని బావిలో పడి తీవ్ర గాయాల పాలైన విషయం విదితమే. పీఈఎస్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు బోరుమని విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

కేంద్రీయ విద్యాలయ కమిషనర్‌కు ఎంపీ లేఖ

చిత్తూరు సిటీ, జూలై 12: చిత్తూరుకు మంజూరైన కేంద్రీయ విద్యాలయను త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కేంద్రానికి లేఖ రాశారు. ఇప్పటికే ఢిల్లీలో ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిసి చిత్తూరులో పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి గురించి లేఖలను అందించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో కేంద్రీయవిద్యాలయసత్సంగ్ కమిషనర్‌కు లేఖ రాశారు. త్వరగా స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు చేయాలని అందులో కోరారు. చిత్తూరు నగరం మంగసముద్రంలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు రూ.8.08 ఎకరాల స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే.

శ్రీసిటీ టాటా స్మార్ట్‌ఫుడ్స్ పరిశ్రమకు లీడ్ ప్లాటినం సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 12: శ్రీసిటీలో ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్ ఫుడ్స్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్) ప్రతిష్టాత్మక యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి లీడ్ ప్లాటినం సర్టిఫికెట్ అందుకుంది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ డిజైన్(ఎల్ఈఈడీ) సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాల్లో అసాధారణ పనితీరు కొలమానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్‌ప్లాటినం సర్టిఫికెట్ సొంతం చేసుకుంది. పర్యావరణ బాధ్యత, పని సామర్థ్యం పట్ల తమ నిబద్ధతను ఇది ధృవీకరిస్తుందని సంస్థ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ పురుషోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు వరించడం పట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి టాటా స్మార్ట్‌ఫుడ్స్ బృందానికి అభినందనలు తెలిపారు.

'కోర్టు కేసులోని భూమికి పాసుపుస్తకాలు ఇచ్చారు'

పెనుమూరు, జూలై 12: పెనుమూరు మండలం కలికిరి సచివాలయ పరిధిలోని ఓబయ్యగారిపల్లిలో ఓ కుటుంబానికి సంబంధించిన తాతల ఆస్తి తమకు తెలియకుండా పాసుపుస్తకాలు ఇచ్చారని యుగంధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తాతల ఆస్తి కుటుంబ పెద్ద శ్రీనివాసులునాయుడు పేరుతో సుమారు 10 ఎకరాల భూమి ఉంది. కుటుంబ వివాదాలతో ఆ భూమిపై కోర్టులో కేసు నడుస్తోంది. అయితే 2020లో అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టులో ఉన్న భూమికి ఎటువంటి మ్యూటేషన్ చేయకుండా శ్రీనివాసులునాయుడు కుమారుడు హేమాచలపతినాయుడు కుటుంబ సభ్యుల పేరుతో ఆన్‌లైన్‌లో వన్‌బీ చేశారు. ఉమ్మడి ఆస్తి, కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఎవరికీ తెలియకుండా అప్పటి తహసీల్దారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వైసీపీ నాయకుల అండతో ఇష్టం వచ్చినట్లు భూములు తారుమారు చేశారు. సమాచారహక్కు చట్టంతో వివరాలు తీసుకుని, పూర్తి ఆధారాలతో స్పందనలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు' అని యుగంధర్ ఆవేదన వ్యక్తంచేశారు. కోర్టులో ఉన్న తమ భూమిపై పూర్తి విచారణ చేసి 15 కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రజా వినతులపై స్పందించాలి : జేసీ


వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 12: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు రెండు గంటలకొకసారి శాఖా పరమైన మెయిల్స్‌ను పరిశీలించి స్పందించాలన్నారు. సీఎం కుప్పం పర్యటనలో వచ్చిన వినతులను పరిష్కరించి, నివేదికను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులను ప్రతినెలా 15వ తేదీలోపు పంపిణీ చేయాలన్నారు. డీఆర్వో పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, డీఎస్వో శంకరన్, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, ట్రాన్స్‌కో ఈఈ హరి, డీఎల్‌డీవో రవికుమార్ పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అక్రమకేసుల నుంచి విముక్తి కల్పిస్తాం: నారా లోకేశ్


మంత్రి లోకేశ్‌తో జయశంకర్

రామకుప్పం, జూలై 12: వైసీపీ ప్రభుత్వం బనాయించిన అక్రమకేసుల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలకు విముక్తి కల్పిస్తామని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, మంత్రి నారాలోకేశ్ భరోసా ఇచ్చారని రామకుప్పం మండలం గోవిందపల్లెకు చెందిన టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్ తెలిపారు. శుక్రవారం తాను హైదరాబాదులో నారా లోకేశ్‌ను కలిశానని ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తన కుటుంబంపై వైసీపీ నేతలు కక్షసాధిస్తూ తనతో బాటూ తన భార్య మాజీ సర్పంచు మహాదేవి, ఇతర కుటుంబసభ్యులపై 42అక్రమ కేసులు బనాయించారని, జీవనోపాధిగా ఉన్న సిమెంటు ఇటుకల తయారీ కేంద్రాన్ని మూయించారని మంత్రికి వివరించానని తెలిపారు. తన సమస్యలను సావధానంగా విన్న మంత్రి లోకేశ్ తన కుటుంబానికి తగిన న్యాయం చేసి, ఆదుకుంటానని హామీ ఇచ్చారన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


అన్నదానం చేస్తున్న ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, జూన్12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈవో ఏకారంబరం భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు.

గాయపడ్డ విద్యార్థిని మృతి

సోమల, జూలై 12: తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ విద్యార్థిని శుక్రవారం మృతి చెందినట్లు ఎంఈవోలు శివరత్నమ్మ, శ్రీరాములు తెలిపారు. సోమల జయంతి కాలనీకి చెందిన రాజేంద్ర కుమార్తె నవ్య స్థానిక పాఠశాలలో 2వ తరగతి చదువుకుంటోంది. ఈ నెల 7వ తేదీన ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో ఆడుకుంటూ తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు ఆ విద్యార్థిని పీలేరు ప్రభుత్వ వైద్యశాల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈక్రమంలోనే ఎంఈవోలు శుక్రవారం స్థానిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థినికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

చిన్నారి హత్య అమానుషం



చౌడేపల్లె, జూన్12: చిన్నారి (9) హత్య అమానుషం అని వాల్మీకి సంఘం నాయకులు ఆది పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండులో వాల్మీకి సంఘం నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు చెందిన చిన్నారిపై అత్యాచారం చేసి చంపేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. వెంకట రమణ, గణేష్, నాగరాజ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

శాంతిపురం, జూలై 12 : మండల పరిధిలోని సొన్నేగానిపల్లె పాఠశాల విద్యార్థులకు మండల టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు శుక్ర వారం పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు అనుసూయ, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, ఎంకేపురం, సొన్నేగానిపల్లె పంచాయితీల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి బాలు, నేతలు నాగభూషణం, శివకుమార్, మునెప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం వితరణ



పలమనేరు, జూలై 12 : పలమనేరు మున్సిపాలిటీలో పని చేస్తున్న 130 మంది పారిశుధ్య కార్మికులకు శుక్రవారం స్థానిక శ్రీనివాసా టెక్స్‌టైల్స్ యజమాని శ్రీపురం సత్యం యూనిఫాం వితరణగా అందజేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు.

వ్యాధులు ప్రబలకుండా శుభ్రత పాటించండి

బైరెడ్డిపల్లె, జూలై 12 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ గ్రామస్తులకు సూచిం చారు. మండలంలోని కమ్మనపల్లె గ్రామాన్ని శుక్రవారం సందర్శించి ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిం చారు. అనంతరం కమ్మనపల్లె గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, ఆదర్శపాఠశాలను సందర్శించి సీజనల్ వ్యాధుల నివారణ చర్యల గురించి పలు సూచనలు చేశారు. ఈవోఆర్డీ రాజేంద్రబాలాజీ, వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్ గోపి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఏఎన్ఎం పద్మ, గ్రామకార్యదర్శి మహేష్, ఆశా కార్యకర్తలు అమరమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

దాడులపై తప్పుడు రాతలా?

● జగన్ పత్రికపై దాదేపల్లె గ్రామస్తుల ఆగ్రహం

చౌడేపల్లె, జూన్ 12: చౌడేపల్లె మండలం దాదేపల్లె మక్కా మసిద్ వక్ఫ్‌బోర్డు నిధులు వైసీపీ నాయకులు దోచుకుని దాడులు చేస్తే.. జగన్ పత్రికలో తప్పుడు వార్తలు రాయడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు. శుక్రవారం వీరు మసీదు వద్ద మాట్లాడారు. 'వైసీపీ నాయకులు సుల్తాన్‌సాబ్, బషీర్‌సాబ్ 2019 నుంచి వక్ఫ్‌బోర్డు నిధులు రూ..6.22 లక్షలు దోచుకున్నారని జిల్లా బోర్డు అధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్‌మొద్దీన్ విచారణ చేపట్టారు. ఆయన సమక్షంలోనే మసిద్ ముత్తవల్లి అమీద్‌ఖాన్, మసిద్ కమిటి సభ్యులు, గ్రామస్తులపై వైసీపీ నాయకులు దాడు చేశారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ సమక్షంలోనే మాపై దాడులు చేస్తే.. జగన్ పత్రికలో వైసీపీ నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారని రాయటం ఏమిటి? ఈ నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీలకతీతంగా ముస్లిం సోదరులు కోరుతుంటే.. జగన్ పత్రికలో ఇలా రాయటం మంచిది కాదు' అని చెప్పారు. అనంతరం ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు.

వైసీపీ శ్రేణుల గొడవనూ మాకు అంటకడతారా?

● జగన్ పత్రిక ప్రతులను దహనం చేసిన టీడీపీ శ్రేణులు

సోమల, జూలై 12: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ ఎగువపల్లెలో గురువారం వైసీపీ కార్యకర్తలు సాయి గణేశ్, కిరణ్ గొడవపడ్డారు. కిరణ్‌కు రక్తగాయాలయ్యాయి. దాడి చేసిన వ్యక్తి టీడీపీకి చెందిన కార్యకర్త అంటూ తమకు అంటకడుతూ జగన్ పత్రికలో తప్పుడు రాతలు రాయడం దారుణం' అని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహించారు. ఇలాంటి వార్తలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండు వద్ద ఆ పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పి.శ్రీనివాసులు, ఈశ్వర్ యాదవ్, కే.శంకర్, కె.శ్రీనివాసులు, గుర్రప్ప నాయుడు, రవి, బాబయ్య, మనోహర్ నాయుడు, శేఖర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూన్12: పుదిపట్లలో వెలసిన స్వయంభు వైష్ణవిదేవికి శుక్రవారం ఉదయాన్నే పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అపురూపం



ఓ వైపు చిరుజల్లులు.. మరో వైపు సూర్య కిరణాలు.. ఆకర్షణీయంగా ఆకాశంలో ఏడు రంగుల ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది. సోమల సమీపంలో కుప్పకొండ-ఊరకొండను కలుపుతూ ఆ ఇంద్రధనస్సు ఏర్పడింది. సాయంత్రం 5గంటల నుంచి 5.30 వరకు ఆ అపురూప దృశ్యం ఆకాశంలో ఆవిష్కృతమైంది. పలువురు ఈ ఇంద్రధనస్సును తమ సెల్‌ఫోన్లలో బంధించారు. - సోమల

ట్రిపుల్ ఐటీకి శాంతిపురం విద్యార్థులు


శాలిని, మీనా

శాంతిపురం, జూలై 12 :మండలంలోని తుమ్మిశి ఆదర్శ పాఠశాలకు చెందిన మీనా, అనికెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన శాలిని ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లత, అనికెర పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మెన్ మంజునాథ్, లక్ష్మీనారాయణ, భార్గవి, కుసుమకుమారి, నరసింహులు తదితరులు ఉన్నారు.

ట్రిపుల్‌ఐటీకి చరణ్ ఎంపిక


విద్యార్థి చరణ్

బైరెడ్డిపల్లె, జూలై 12 : మండలంలోని పెద్దచెల్లారగుంట జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి చరణ్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. చరణ్‌ను హెచ్‌ఎంతో పాటు ఎంఈవో, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన నాగేశ్వరి



సోమల, జూలై 12: సోమల హైస్కూల్‌లో పదో తరగతి చదివిన అడుసు పల్లెకు చెందిన ఎం. నాగేశ్వరి ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని హెచ్‌ఎం హరినాథ్ తెలిపారు. ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, రామాంజులు, పీడీ కరుణానిధి తదితరులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి మోడల్ స్కూల్ విద్యార్థులు

పుంగనూరు, జూలై 12: పుంగనూరు మండలం అడవి నాథునికుంట మోడల్ స్కూల్ విద్యార్థులు వి.మదన్‌మోహన్, డి.జానకి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమ శుక్రవారం తెలిపారు. మదన్‌మోహన్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, జానకి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని వివరించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

బైరెడ్డిపల్లె, జూలై 12 : మండలంలోని గంగినేపల్లె సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో పాతూరునత్తం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కోటేశ్వర్ గాయపడ్డాడు. బైరెడ్డిపల్లె నుంచి పాలక్యాన్లు వేసుకుని ఆటోలో వెళుతుండగా గంగినేపల్లె సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కోటేశ్వర్ గాయపడ్డాడు. బాధితుడిని ఆయన కుటుంబసభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

గుడుపల్లె, జూలై 12: జాతికర్తనపల్లెలో గంగమ్మల అగ్ని గుండం ప్రవేశం శుక్రవారం వేడుకగా జరిగింది. మండలంలోని జాతికర్తనపల్లె గ్రామంలో వెలసిన గ్రామ దేవతలైన ఊరి గంగమ్మ, బాట గంగమ్మ, కుంటి గంగమ్మ, మారెమ్మ దేవాలయాల వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవార్లకు ఆలయ పూజారులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం గంగమ్మల ఉత్సవర్లను పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరిచారు. అమ్మవారి ఉత్సవర్లను డప్పువాయిద్యాలు, నయ్యాండి నృత్య ప్రదర్శనతో ఆలయాల చుట్టూ ఊరేగించారు. తరువాత పచ్చిగెరిగెతో అమ్మవార్ల ఉత్సవాలను అగ్ని గుండం ప్రవేశం చేశారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

పెద్దపంజాణి, జూలై 12: మండలంలోని రాజుపల్లె పంచాయతీ కమ్మినాయనపల్లెలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి స్థానిక హెచ్‌ఎం రెడ్డిరమేష్ వీటిని పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు భానుప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు వాసు, నాయకులు మంజునాథరెడ్డి, బాలాజి, వెంకటక్రిష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, గణేష్, హరి, అమర్నాథ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురంలో గంగజాతర ప్రారంభం

శాంతిపురం, జులై 12: శాంతిపురం, అరిముత్తనపల్లె గ్రామాలలో శుక్రవారం రాళ్లగంగమ్మ, సల్లాపురమ్మ అమ్మవార్ల గంగజాతర వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. రంగు రంగుల పూలతో అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అన్నదానాలు చేశారు.

బీఎస్‌రావుకు నివాళి

పలమనేరు, జూలై12 : రాష్ట్ర విద్యారంగానికి బీఎస్‌రావు విశేష కృషి చేశారని శ్రీచైతన్య పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం బీఎస్‌రావు వర్ధంతి సందర్భంగా ఇక్కడి శ్రీచైతన్య పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం జి.సురేష్ హెచ్‌ఎం సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోనగర్ స్థల పరిశీలన


ఆటోనగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజరు, రాజ్‌కుమార్

కుప్పం, జూలై 12: కుప్పంలో ఆటోనగర్ కోసం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పరిశీలించారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రస్తుతం కుప్పం పురపాలక సంఘం పరిధిలోకి వచ్చే తంబిగానిపల్లె, మోడల్ కాలనీ సమీపంలో సుమారు 11 ఎకరాల స్థలాన్ని ఆటోనగర్‌కోసం ప్రభుత్వం కేటాయించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ఊసే లేకుండా పోయింది. అందుకోసం కేటాయించిన స్థలంలో కొంత భాగం ఆక్రమణలకు గురైంది. దీనిపై టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తహసీల్దారు హరికుమార్‌ను శుక్రవారం కలిసి నివేదించారు. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజరు ఆటోనగర్‌ను సందర్శించారు. ఆటోనగర్‌కోసం కేటాయించిన స్థలానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కొంత స్థలం ఆక్రమణలకు గురైందని, దాన్ని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని విన్నవించారు. కుప్పంలోని కార్మికులకు ఈ స్థలంలో షాపులు కేటాయిస్తే వారి బతుకులు బాగుపడడమే కాకుండా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని పేర్కొన్నారు. తాను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటానని ఏపీఐఐసీ జోన్ మేనేజరు ఆయనకు హామీ ఇచ్చారు. రెవెన్యూ సర్వేయర్లు, వీఆర్వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి : చల్లా బాబు


చల్లా బాబును సన్మానిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

రొంపిచెర్ల, జూలై 12: పుంగనూరు నియోజక వర్గం అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామ చంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పులిచెర్ల ఎంపీడీవో సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ యుగంధర్ మండలంలోని సచివాలయ సిబ్బందితో కలిసి చల్లాబాబును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు, నాయకులు మురళీధర్ నాయుడు, ధనంజయనాయుడు, గోపినాయుడు, కార్యదర్శులు,పాల్గొన్నారు.

కేసీకి అటానమస్ హోదా



అటానమస్ హోదా సర్టిఫికెట్ ప్రదర్శిస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, జూలై 12: కేఈసీ (కుప్పం ఇంజనీరింగ్ కళాశాల)కు యూజీసీ నుంచి 10 ఏళ్లకు (2024-2025 నుంచి 2033-2034) అటానమస్ హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో సంబరాలు జరిపారు. అటానమస్ హోదా సర్టిఫికెట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ 2021లో స్థాపించిన ఈ కళాశాలకు ఇప్పటికే ఎన్‌బీఏ, న్యాక్ -ఎ గ్రేడ్ హోదాలు సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు పొందిందన్నారు. తాజాగా యూజీసీ అటానమస్ గుర్తింపు నేపథ్యంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల నేడు సాంకేతిక రంగంలో ఉన్నత లక్ష్యాలను విద్యార్థులు అందుకునేలా పాఠ్యాంశాలను రూపొందించ డానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేస్తుందన్నారు. కళాశాలకు అటానమస్ హోదా రావడానికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్‌లను, విభాగాధి పతులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందిని బీసీ.నాగరాజ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, సీఈవోట ఎన్.సాగర్ రాజ్ పాల్గొన్నారు.

మహిళ ఆర్థికస్వాలంబనే ధ్యేయం

రామకుప్పం, జూలై 12: రాష్ట్రంలో మహిళల ఆర్థికస్వావలంబన కోసం సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి తెలిపారు. శుక్రవారం కెంచనబల్లలో నిర్వహించిన గ్రామసమాఖ్య సమావేశంలో వారు మాట్లా డారు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను మహిళలకు అందించి ఆదుకుంటారన్నారు. వెలుగు ఏపీఎం లావణ్య, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జీలు గజేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు గుణశేఖర్ పాల్గొన్నారు.

చదువుతో పాటు మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న డీవైఈవో పురుషోత్తం

పుంగనూరు, జూలై12: విద్యార్థులకు చదువుతోపాటు మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మదనపల్లె డీవైఈవో పురుషోత్తం సూచించారు. శుక్రవారం పుంగనూరు మండలం అడవినాథునికుంట మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. కొద్దికాలంగా మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమ పాఠశాలకు సక్రమంగా హాజరుకాలేదని, ఫలితంగా ఉపాధ్యా యులు బోధన సరిగా అందించడం లేదని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేసినట్లు ఆయన తెలియజేశారు. తరగతి గదులు, రికార్డులతో పాటు హాస్టల్ తనిఖీ చేశారు. పిల్లలకు మెరుగైన బోధన అవిద్యానాణ్యత పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు. కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేశారు. మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ రమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం పర్యావరణాన్ని రక్షించాలి



కల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కల్లూరు, జూలై 12: పర్యావరణ పరి రక్షణ అవసరమని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఎన్జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, ఎన్జీసీ గ్రీన్ మాస్టర్ వెంకట సిద్ధులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం ఎన్జీసీ ఆధ్వర్యంలో ప్రపంచ కాగితపు దినోత్సవం నిర్వ హించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్లాస్టిక్‌ను వదిలేసి కాగితపు సంచులు వినియోగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహమత్‌బాషా, కాటయ్య, చలపతి, సైదుల్లా, చంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పెద్దపంజాణి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ కళాశాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తన తండ్రి మాజీ ఎంపీ రామక్రిష్ణారెడ్డి ప్రారంభించారని అదే ఉన్నత పాఠశాల నేడు జూనియర్ కళాశాలగా తన చేతులతో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఈఓ పురుషోత్తం, ఎంఈఓ గోపాల్‌రెడ్డి, తులసీరామ్, మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి, హెచ్‌ఎం కేశవపిళ్ళై, నాయకులు శ్రీరాములు, చెంగారెడ్డి, మురహరిరెడ్డి, రాజారెడ్డి, భానుప్రతాప్‌రెడ్డి, నాగరాజరెడ్డి, నాగరాజ, రామక్రిష్ణ, బావాజాన్, కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ప్రవీణ్, ధనుంజయ, చలపతి, రవి, మంజునాథ్, శ్రీనివాసులు, లోకనాథ్, హరి, మురళి, హరిశంకర పాల్గొన్నారు.

విద్యతోనే అసమానతలు దూరం


విద్యార్థులకు క్రీడా, విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్న కంచర

రామకుప్పం, జూలై 12: విద్యతోనే సమాజంలోని అసమానతలు దూరం అవుతాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సీఎం వ్యక్తిగత సహాయకుడు మనోహర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం కెంపసముద్రం ఉన్నతపాఠశాల విద్యార్థులకు మిట్టపల్లెకు చెందిన రాజ్యాధికారం టీం అధినేత నవీన్ బృందం వితరణగా ఇచ్చిన విద్య, క్రీడా, వంటసామగ్రిని వారు విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు క్రీడా, విద్యా సామాగ్రిని, పాఠశాలకు వంటపాత్రలను అందించిన రాజ్యాధికారం టీం అధినేత నవీన్ బృందాన్ని వారు అభినందించారు.

ఉసిరికాయల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జూలై12: పుంగనూరు నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ఉసిరికాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగికి గాయాలు

పుంగనూరు రూరల్, జూలై12: పుంగనూరు- చౌడేపల్లె మార్గంలో ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో మున్సిపల్ ఉద్యోగి తీవ్ర గాయాలపాలయ్యాడు. పెద్దపంజాణి మండలం కెళవాతిలో ఉన్న తల్లి గంగులమ్మ అనారోగ్యంతో ఉన్నట్లు తెలియడంతో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి టి. చంద్ర కుంటుబసభ్యులతో కలసి ఆటోలో బయలుదేరాడు. పుదిపట్ల క్రాస్ వద్ద తిరువణపల్లె వైపు నుంచి అతి వేగంగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి చంద్ర, భార్య కళావతి, కుమారుడు వెంకటేశ్ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, జూలై12: 16 మంది పేకాటరాయుళ్లను గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పుంగనూరు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుంగ నూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ కమతంపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 16మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి నుంచి రూ. 36.280ల నగదు, 5 ద్విచక్ర వాహనాలు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

కల్లూరు, జూలై 12: పులిచెర్ల మండలం కల్లూరు ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో శుక్రవారం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదిశంకర్‌రాజు బాధ్యతలు చేపట్టారు. ఈయన పులిచెర్ల లైన్‌మన్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఏడీ నరేంద్ర, ఏఈ పురుషోత్తం, ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఉపసర్పంచ్ రాజీనామా

రొంపిచెర్ల,జూలై12: మండలంలోని బండకిందపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ కె.ఎర్రమ్మ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో రెడ్డెప్పఆచారికి రాజీనామా పత్రం అందజేశారు. ఆమె మూడవ వార్డు మెంబరుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం రెండు పదవులకూ రాజీనామా చేశారు.

రైతులకు విత్తనాల పంపిణీ

రామకుప్పం, జూలై 12: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ బగళనత్తంలో శుక్రవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి రైతులకు సబ్సిడీ మొక్కజొన్న, పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, మంజునాథ్‌నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర, వెంకట్రామిరెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పుంగనూరు, జూలై 12: రైతుల వ్యవసాయానికి, ప్రజల అవసరాలకు విద్యుత్ సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ ఈఈ మహేశ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్లకు విద్యుత్ సరఫరా, తదితర సమస్యల పరిష్కారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పుంగనూరు ఏడీఈ రవికుమార్ రెడ్డి, ఏఈలు శశిధర్, వాసు, అజయ్‌కుమార్, ధనంజయ రావు పాల్గొన్నారు.

ఐదుగురు గురుకులం విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



సదుం, జూలై 12: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన తేజ, యోగేశ్వర్, చరణ్, కార్తీక్, లీలాధర్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. కళాశాల సిబ్బంది అభినందించారు.

రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

రామకుప్పం, జూలై 12: రాష్ట్రంలో రైతులకు టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సీఎం వ్యక్తిగత సహాయకుడు మనోహర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం పశువైద్యకేంద్రంలో ఆయన రైతులకు సబ్సిడీ మొక్కజొన్న, పశుగ్రాసం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీ చిన్నికృష్ణ, పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతాం



కట్టమంచి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల, మేయర్ అముద

చిత్తూరు, జూలై 12: నగరంలోని కట్టమంచి, గంగినేని చెరువులను ఆధునిక హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శుక్రవారం ఆయన మేయర్ అముద, ఇరిగేషన్ అధికారులతో కలిసి రెండు చెరువు కట్ట ప్రాంతాలను పరిశీలించారు. సర్వే రికార్డులను తెప్పించి పరిశీలించారు. చెరువులకు నీళ్లు వచ్చే కాలువలను శుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. చెరువుకట్ట ప్రాంతాలను వాకింగ్ ట్రాక్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ హీరాలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జింక కళేబరానికి పోస్టుమార్టం

గుడిపాల, జూలై 12 : మండలంలోని అడవిచేను గ్రామంలో గురువారం సాయంత్రం కుక్కల దాడిలో మృతిచెందిన జింక కళేబరానికి శుక్రవారం ఉదయం బీట్ అధికారిణి కుసుమ, పశువైద్యాధికారిణి సాయిసుధ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దాన్ని కాల్చేశారు.

పారిశుధ్యమా నీ జాడెక్కడ..?



గత్రాళ్లమిట్టలో పేరుకుపోయిన మురుగునీరు

గుడిపాల, జూలై 12: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దోమల బెడద ఎక్కువైంది. గత్రాళ్లమిట్ట, వెంగమాంబాపురం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో డ్రైనేజీలు చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చినుకురాలితే చిత్తడే



బురదమయంగా ఉన్న రోడ్డు

కార్వేటినగరం, జూలై 12: మండలంలోని ఆర్‌కేవీబీ పేట రోడ్డు చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారుతోంది. మట్టి రోడ్డు కావడం, ఆపై గుంతలు ఎక్కువగా ఉండడంతో వర్షానికి నీరు చేరి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. తారు రోడ్డు వేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని, కనీసం గుంతలకు ఎర్రమట్టి తోలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ అధ్యక్ష పదవికి పోటీ

కార్వేటినగరం, జూలై 12: స్థానిక కొమరగిరిపై వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్ర ఎండోమెంట్ శాఖ పరిధిలోని ఈ ఆలయ గత పాలకవర్గం ప్రభుత్వం మారడంతో రాజీనామా చేసిన విషయం విదితమే. కొత్త పాలకవర్గంలో చోటుకోసం నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే థామస్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ పోటీలో అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐరాల/తవణంపల్లె, జూలై 12: తవణంపల్లె, ఐరాలలోని సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా వాటి పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చలపతి, ఏడీ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

16న జాబ్‌మేళా

నగరి, జూలై12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్‌ఎఫ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2024 లోపు డిగ్రీ పూర్తి చేసి, 20 నుంచి 26 లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు మార్కుల జాబితాల జిరాక్స్, డిగ్రీ టీసీ, ఒరిజినల్ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9952970545, 9573104593లను సంప్రదించాలని తెలిపారు.

సీఎం కొత్త ఇండ్లులో చోరీ

గుడిపాల, జూలై 12: మండలంలోని ఏఎల్‌పురం పంచాయతీ సీఎం కొత్తఇండ్లు గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రఘు తన తండ్రి అంత్యక్రియల కోసం శ్రీరంగరాజపురం మండలానికి గురువారం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోనికెళ్లి చూశాడు. బీరువాలో ఉంచిన నాలుగున్నర సవర్ల బంగారం కనిపించలేదు. గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీసీఈవో తనిఖీలు



గుడిపాల, జూలై 12: ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈవో గ్లోరియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పారిశుధ్య పనులపై ఆరా తీశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర, పంచాయతీరాజ్ ఏఈ హేమచంద్రారెడ్డి, చందు ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో వీధిలైట్ల ఏర్పాటు



గుడిపాల, జూలై 12: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవతో మండలంలోని రావ ు భ ద్రా పు రం పంచాయతీ దుర్గాపురం గ్రామంలో సర్పంచ్ హరిణి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడుల ఆధ్వర్యంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు సంబంధిం చిన సమస్యను పరిష్క రించారు.

విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, జూలై 12: మండలంలోని మంగళం న్యూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థు లకు రిటైర్డు హెచ్‌ఎం చంద్రయ్య శుక్రవారం నోటుపుస్తకాలు, క్రయా న్స్, పెన్నులు, పెన్సిల్ అందించారు. పాఠశాల హెచ్‌ఎం కులశేఖర్, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరులో అన్ని రైళ్లు ఆగేలా చర్యలు : ఎంపీ



చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దగ్గుమళ్ల

చిత్తూరు రూరల్, జూలై 12: చిత్తూరులో అన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన చిత్తూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రూ.12 కోట్లతో ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. స్టేషన్‌లో సమస్యలు, రైళ్ల రాకపోకలపై ఆరా తీశారు. చిత్తూరు మీదుగా 37 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని, అందులో ఆరు ఆగడం లేదని, వాటిని కూడా ఆపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కమర్షియల్ మార్గంలో స్టేషన్‌కు ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. రైల్వే ప్రయాణంలో తమకు కల్పిస్తున్న రాయితీని నిలిపివేశారని, పునరుద్ధరించాలని పాత్రికేయులు కోరగా ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. రైల్వేస్టేషన్ అధికారులతో, కాంట్రాక్టర్లతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు.

చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది

శ్రీరంగరాజపురం : నవ్యాంధ్ర పునర్నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఎస్‌ఆర్‌పురం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్ నాయుడు, నియోజకవర్గ నాయకులు ఆయన్ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు, నిరుద్యోగ యువతకు అండగా నిలిచే దిశగా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, కృష్ణమ నాయుడు, తలారి రెడెప్ప, రాజేంద్రన్, రుద్రయ్య నాయుడు, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే, ఈవో

ఐరాల(కాణిపాకం), జూలై 12: విజయవాడ కనకదుర్గమ్మకు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున శుక్రవారం ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో వెంకటేశు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆషాడ మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం తరపున ఈ మేరకు సారె సమర్పించారు. అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. దుర్గ గుడి ఈవో కేఎస్.రామారావు, కాణిపాకం ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు వడ్లపాటి గిరిధర్‌బాబు, కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాయకులు గంగారపు హరిబాబు, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానం



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ దగ్గుమళ్ల

బంగారుపాళ్యం, జూలై 12: విద్యతోనే విజ్ఞానం సాధ్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. రోప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్లు ధనశేఖర్, శ్రీలతలు సమకూర్చిన రూ.7లక్షల విలువైన వీల్ చైర్లను 30 మంది దివ్యాంగులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. దివ్యాంగ పిల్లలకు ప్రతినెలా రూ.500 చొప్పున 50 మందికి చెక్కులను అందజేశారు. మహిళల ఉపాధి కోసం రూ.15 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సూచించారు. అంతకుముందు టీడీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఉపాధ్యక్షురాలు ఇందిరమ్మ, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



డీఈవోతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 12: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో దేవరాజును ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పురపాలిక పాఠశాలల్లో, తెలుగు, హిందీ వంటి భాష స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతి కల్పించాలని కోరారు. ఎస్జీటీ, పండిట్‌లకు ఉమ్మడి సీనియారిటీ ద్వారా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్, ఉపాధ్యక్షుడు జగదీష్, అమరనాథరెడ్డి, కృష్ణమూర్తి, గుణశేఖర్, మునీర్ పాల్గొన్నారు.

కుటుంబ సుస్థిరత కోసమే ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్



కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 12: సమాజ శ్రేయస్సు, కుటుంబ సుస్థిరత కోసం ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ అన్నారు. శుక్రవారం ఆయన మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మహిళల భద్రత, సమాజంలో శాంతిభద్రతలను కాపాడటానికి మరో అడుగు ముందుకు వేస్తున్నామన్నారు. ఈ కేంద్రంలో మానసిక నిపుణులు, కౌన్సిలర్లు, చట్ట నిపుణులు అందుబాటులో ఉంటారని, వీరు బాధితులకు సలహాలతో పాటు సమస్యల పరిష్కారానికి సహకరిస్తారని తెలిపారు. అనంతరం సెంటర్‌లో ఉన్న సదుపాయాలు, సౌకర్యాలను పరిశీలించారు. మహిళా స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, చిత్తూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, లక్ష్మణ్ణ, నిత్యబాబు, ఎస్‌ఐలు, న్యాయవాదులు, డాక్టర్లు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ఉద్యోగాలూ అమ్మేశారు : టీడీపీ

చిత్తూరు సిటీ, జూలై12: మాజీ మంత్రి పెద్దిరెడ్డి విద్యుత్, విద్యా శాఖల్లో ఉద్యోగాలు అమ్ముకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భూములను, గనులను, ఇసుకను, మట్టిని దోచుకోవడమేగాక నిరుద్యోగుల కడుపు కొడుతూ ఉద్యోగాలు అమ్ముకున్నారని తెలిపారు. విద్యుత్ శాఖలో దాదాపు 700 మందిని ఫీల్డ్‌అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. ఒక్కొక్క ఉద్యోగానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేశారని వెల్లడించారు. వైద, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా 375మందిని నియమించారని తెలిపారు. ఇందులో దాదాపు రూ.20 కోట్ల వరకు చేతులు మారాయని చెప్పారు. నేతలు మోహన్‌రాజ్, సునీల్ కుమార్ చౌదరి, మధు యాదవ్, బాబు నాయుడు పాల్గొన్నారు.

జేసీల్లో ఎండీఎం పునఃప్రారంభించాలి



మంత్రి లోకేశ్‌తో శరత్‌చంద్ర

చిత్తూరు (సెంట్రల్), జూలై 12: జూనియర్ కళా శాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించాలని తెలుగునాడు ఇంటర్మీడియట్ ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శరత్‌చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వెలగపూడిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో జేసీల్లో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తద్వారా వేలాది మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. హాజరుశాతం పెంచడంతో పాటు పేద విద్యార్థులను ఆదుకోవడానికి ఈ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

పాలసముద్రం, జూలై 12: గంగాధరనెల్లూరు మండలం నుంచి పాలసముద్రం మీదుగా తమిళనాడుకు ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం గ్రామానికి చెందిన వైసీపీ నేత పద్మనాభం నాయుడు తన టిప్పర్‌ను తమిళనాడు లోని నీలమేఘానికి లీజుకిచ్చాడు. గంగాధర నెల్లూరు మండలం నుంచి ఇసుకను తమిళనాడులోని ఆర్కేపేటకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఆర్కేపేట పోలీసులు శుక్రవారం వేకువజామున పాలసముద్రం మండలం సరిహద్దు ప్రాంతమైన మఠవలం గ్రామం వద్ద మాటువేశారు. పోలీసులను గమనించిన డ్రైవర్ టిప్పర్‌ను వదిలిపెట్టి పారిపోయాడు. టిప్పర్‌ను పాలసముద్రం ఎస్‌ఐ భారతికి అప్పగించారు. ఆమె కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక మంత్రికి సన్మానం



విజయపురం, జూలై 12: గ్రామ పంచాయతీ నిధుల విడుదలకు కృషి చేసిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం అమరావతి సచివాలయంలో పంచాయతీరాజ్ చాంబర్ ప్రతినిధులు సత్కరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి కేశవ్ బాధ్యతలు తీసుకున్న నెల రోజుల్లోపే ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పయనం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేస్తూ తొలి సంతకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బిర్రు ప్రతాప్‌రెడ్డి, కొత్తపు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శికి శుభాకాంక్షలు

నగరి జూలై12: టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో నగరి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. నాయకులు గుణశేఖర్, పురుషోత్తంనాయుడు, దేవా, వెంకీ, వెంకటాచలం నాయుడు, నారాయణస్వామినాయుడు, వరదరాజులు, శివకుమార్‌రెడ్డి, ఉమాపతిరాజు, జిలానీబాయ్ రామ్మూర్తి నాయుడు, కన్నివేలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెస్ చెల్లించకపోవడం బాధాకరం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 12: స్థానిక సంస్థలు ఏటా గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లించకపోవడం బాధాకరమని జేసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర పాలక, పురపాలక, గ్రామ పంచాయతీలు వసూలు చేసిన ఆస్తిపన్నులో 8శాతం జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లించాలన్నారు. 16 సంవత్సరాలుగా చెల్లించకపోవడం సరికాదన్నారు. వెంటనే చెల్లించి గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడాలన్నారు.

దుస్తులను సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం, జూలై 12: విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని వెదురుకుప్పం మండలం దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జి.ఉమాపతి అన్నారు. శుక్రవారం పాఠశాలలోని 145 మంది విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా దుస్తులను అందజేశారు. హెచ్‌ఎం చంద్రనాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన



ఎన్టీఆర్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలతో టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 12: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందని మాజీ ఆర్‌టీఏ మెంబర్ మునిరత్నంనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమార్‌నాయుడు, బీసీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నటరాజ్‌మొదలి అన్నారు. మహాదేవమంగళం సచివాలయానికి వారు శుక్రవారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను అందజేశారు. నేతలు రుషేంద్రనాయుడు, నీలకంఠనాయుడు, నాగేష్‌నాయుడు, సీ.కే.బాబునాయుడు, మైకేల్, రఘు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సమీక్షించుకోవాలి



ప్రజా వేదిక కార్యక్రమంలో అధికార బృందం

వెదురుకుప్పం, జూలై 12: సామాజిక తనిఖీల్లో పరిశీలించిన పనులను గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, రైతులు సమీక్షించుకోవాలని డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. వెదురుకుప్పంలో శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో పూడిపోయిన ఫారంపాండ్లను మళ్లీ తవ్వుకోవాలన్నారు. మామిడి చెట్లు ఎండిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్తవి నాటుకోవాలన్నారు. మండలంలో వివిధ కారణాలుగా చూపిన రూ.1,17,756 రికవరీకి ఆదేశాలిచ్చారు. డీవీవో గంగాభవాని, ఏపీడీ శోభన్‌బాబు హాజరయ్యారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగులు

చిత్తూరు సిటీ, జూలై 12: సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 30 రోజుల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి 16,347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పెంచిన పింఛను పంపిణీ చేసిందని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడమేగాక ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసిందన్నారు. అధికార యంత్రాంగంలోనూ ప్రక్షాళన మొదలైందన్నారు.